క్లుప్తంగా

వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యుడిగా సయ్యద్ అబ్దుల్ రహీం



క్రోసూరు: పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యుడిగా మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్, ప్రస్తుత సచివాలయ కన్వీనర్ సయ్యద్ అబ్దుల్ రహీం నియమితుయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర చీఫ్ వక్ఫ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ అధికారి ఎల్.అబ్దుల్ ఖాదిర్ ఉత్తర్వులు అందజేసినట్లు రహీం తెలిపారు. జిల్లాలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. తనకు బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయ సేవా పథకాల అమలు న్యాయవాదిగా ఏడుకొండలు



సత్తెనపల్లి: మండల న్యాయ సేవాధికార కమిటీలో న్యాయ సేవా పథకాల అమలు న్యాయవాదిగా పట్టణానికి చెందిన ఎం.ఏడుకొండలు నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోన్నత లీగల్ సర్వీసెస్ అథారిటీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జన విజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడిగా, జర్నలిస్ట్‌గా సుపరిచితులైన ఏడుకొండలు లీగల్ సర్వీస్ న్యాయవాదిగా ఎంపికవ్వడంపై పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సమ న్యాయం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.

డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించండి



సత్తెనపల్లి: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించాలని నర్సరావుపేట పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి తెలిపారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల ప్రధాన తపాలా కార్యాలయంలో ఏజెంట్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పోస్టాఫీసు పొదుపు పథకాల్లో పెట్టుబడి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. పోస్టాఫీసు పొదుపు పథకాలైన రికరింగ్ డిపాజిట్, నేషనల్ సేవింగ్స్, తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా బీమాలో పెట్టుబడి పెడితే సొమ్ముకు భద్రత ఉంటుందని చెప్పారు. సమావేశంలో పోస్టుమాస్టర్ జె. రామకృష్ణ కుమార్ పాల్గొన్నారు.

లీగల్ అడ్వైజర్‌గా గోవిందాచారి నియామకం



సత్తెనపల్లి: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అండ్ మీడియా ఆర్గనైజేషన్ ఏపీ స్టేట్ లీగల్ సలహాదారుడిగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన యువ న్యాయవాది కోటగిరి లక్ష్మణ గోవిందాచారిని ఆ సంస్థ ప్రెసిడెంట్ కె. గోపీ ప్రసన్నకుమార్ నియమించారు. ఈ మేరకు గోవిందాచారి నియామక ఉత్వర్వులు అందుకున్నారు. 2024 జనవరి వరకు పదవిలో ఉంటానని, ప్రజలకు మరింత సేవ చేయడంలో బాధ్యతగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది బుధవారం గోవిందాచారిని ప్రత్యేకంగా అభినందించారు.

నీట్ పీజీలో శృతికి 882వ ర్యాంక్



అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెన్నా శ్రీనివాసరెడ్డి కుమార్తె శృతి ఆల్ ఇండియా పీజీ మెడికల్ ఓపెన్ క్యాటగిరిలో (నీట్–2023)లో 882వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెను జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చింతగుంట్ల అనూరాధ, హనుమంతరెడ్డి దంపతులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ తదితరులు బుధవారం అభినందించారు.

'స్వచ్ఛ సత్తెనపల్లి'కి సహకరించాలి

సత్తెనపల్లి: స్వచ్ఛ సత్తెనపల్లికి ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి కోరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణాన్ని ఓడీఎఫ్ ప్లస్‌గా, గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. పురపాలక సంఘ పరిధిలో బహిరంగ మూత్ర విసర్జన చేసిన వారికి రూ.50, బహిరంగ మలవిసర్జన చేసిన వారికి రూ.200, చెత్తను వీధులు, మురుగు కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో పారవేసిన వారికి రూ.50 జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

బహుజనుల హక్కుల కోసం కాన్షీరాం పోరాటం



సత్తెనపల్లిలో సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

సత్తెనపల్లి: జీవితాంతం బహుజనుల హక్కులు, సాధికారత కోసం పోరాటం చేసిన గొప్ప నాయకుడు కాన్షీరాం అని బీసీ సంఘ నాయకులు కొనియాడారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లో బుధవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో కాన్షీరాం 89వ జయంతి వేడుకల్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ భారతదేశంలోని కుల వ్యవస్థ మీద అవగాహన కల్పించిన గొప్ప సామాజికవాది కాన్షీరాం అని కొనియాడారు. జీవితమంతా వెనుకబడిన తరగతుల్ని అధికారంలోకి తీసుకురావడానికి, వారిని ఏకతాటి మీదకు తీసుకురావడానికి అంకితం చేశారని తెలిపారు. ఓట్లు మావే.. సీట్లు మావే నినాదంతో బహుజనులను అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత కాన్షీరాంకు దక్కిందని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు మంగలపూరి నాగేశ్వరరావు, చావల వెంకటేశ్వర్లు, రాష్ట్ర దళిత సేవా దళ్ సభ్యుడు తాళ్లూరి అమర్నాథ్, మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు, చిమటా అనిల్, బూర్సు శ్రీనివాసరావు, గుంటూరు గోవింద్, చింకా అంకమ్మరావు, గుంజి విజయ్ కుమార్, వెంకటస్వామి, కుమ్మరి దస్తగిరి, దుడుకు కోటేశ్వరరావు, తుళ్లూరి శివరామకృష్ణ, కుమ్మరి తిరుపతిరావు, తేటనీళ్ల అప్పయ్య, మేకల చింతయ్య పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో...

కాన్షీరాం స్ఫూర్తితో బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం కోసం పోరాడాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు పేరుపోగు నవీన్‌బాబు పిలుపునిచ్చారు. బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 89వ జయంతి వేడుకల్ని పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లోని విగ్రహం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నవీన్‌బాబు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా నూతన నియోజకవర్గ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడుగా పేరుపోగు నవీన్‌బాబు, కన్వీనర్– 1గా కుక్కమళ్ల దేవానంద్ కుమార్, కన్వీనర్– 2గా పెరుగు కోటేశ్వరరావు యాదవ్, ఉపాధ్యక్షుడిగా చింతపల్లి ముసలయ్య, ప్రధాన కార్యదర్శిగా తలతోటి కోటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొడవటి రాంబాబు, ట్రెజరర్, ఆఫీస్ సెక్రటరీగా గుజ్జర్లపూడి స్టాన్లీ, బీవీఎఫ్ నియోజకవర్గ కన్వీనర్‌గా దర్శి వందనం నియమితులయ్యారు. కార్యక్రమంలో జిల్లేళ్ల పాల్‌రాజు, బంకా రాజారావు, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కో– ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప ఉన్నారు.



సత్తెనపల్లిలో కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు



క్రోసూరులో కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

క్రోసూరులో...

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల సెంటర్‌లో బుధవారం బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్సీరాం 89వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గనుపల్లి శేఖర్, పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడు బంకా తిరుపతయ్య, నల్లగోపు కొండలరావు, షేక్ మస్తాన్, చిలకా చిన్న, జడ అబ్రహం, చిలకా జయరావు పాల్గొన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి

క్రోసూరు: సచివాలయ ఉద్యోగులంతా సమయపాలన పాటించాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు ఆదేశించారు. క్రోసూరులోని సచివాలయం –1, 2, పెరికపాడు సచివాలయాలను ఆయన బుధవారం సందర్శించారు. సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. అనంతరం క్రోసూరులో రైతు బెజ్జంకి నారాయణ, దొడ్లేరులో షేక్ మస్తాన్‌బీ పొలాల వివాదాలపై ఇచ్చిన ఫిర్యాదుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెరికపాడులోని సచివాలయాన్ని సందర్శించి, అక్కడి వీఆర్వోకి ఓటర్ల ఐడీకి ఆధార్ అనుసంధానంపై పలు సూచనలు చేశారు.



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు.

గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



లక్కరాజు గార్లపాడులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ యోగి రాఘవేంద్ర, సిబ్బంది



దమ్మాలపాడులో సేవలందిస్తున్న వైద్యుడు సూర్యప్రకాశరావు, సిబ్బంది

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడులో బుధవారం 165 మందికి వైద్యసేవల్ని అందించారు. సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యోగి రాఘవేంద్ర 104 వాహనంలో సిబ్బందితో వెళ్లి గ్రామంలో శిబిరంతో పాటు, రాలేని వారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్యసేవలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సీజన్‌లో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ జె.సంపూర్ణాదేవి, సీహెచ్ఓ కె.సురేష్ కుమార్, ఏఎన్ఎం పి.మేరీరాణి, ఆశా కార్యకర్తలు సుధా, షారోన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దమ్మాలపాడులో సేవలు

దమ్మాలపాడు(ముప్పాళ్ల): మండలంలోని దమ్మాలపాడులో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల్ని అందించారు. పీహెచ్‌సీ వైద్యులు పి. రమాదేవి, ఎస్.సూర్యప్రకాశరావు 144 మందికి వైద్యసేవలందించారు. రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందుల్ని అందించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందుల్ని అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రహమున్నీసా, సూపర్‌వైజర్లు జోస్పిన్‌రాణి, భవానీకుమారి, ఏఎన్ఎం మస్తాన్‌బీ, డీఈఓ రవితేజ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో పంట నమోదు జాబితా ప్రదర్శన

జిల్లా వ్యవసాయాధికారి మురళి

నకరికల్లు: రైతుభరోసా కేంద్రాల్లో పంట నమోదు ముసాయిదా జాబితాలను ప్రదర్శనలో ఉంచామని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. ప్రస్తుత రబీ సీజన్‌కు గానూ గుండ్లపల్లి రైతు భరోసా కేంద్రంలో బుధవారం ప్రదర్శించిన జాబితాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ పంట నమోదు, ఈకేవైసీ నమోదు వల్ల రైతులకు ప్రభుత్వం ద్వారా అందజేసే పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీలు పొందవచ్చని తెలిపారు. ముసాయిదా జాబితాలను ఈనెల 13వ తేదీ నుంచి 17 ప్రదర్శించే ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పంట నమోదులో వ్యత్యాసాలు ఉంటే ఈ–సోషల్ ఆడిట్ ద్వారా సరి చేసుకోవచ్చని సూచించారు. అనంతరం గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించి, రైతులకు సాగులో మెలకువల్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు రవికుమార్, పిడుగురాళ్ల సబ్ డివిజన్ ఏడీఏ బత్తుల శ్రీకృష్ణదేవరాయలు, డీఆర్‌సీ వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎం.ప్రసన్నకుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి, పలువురు అధికారులు

గుణాత్మక విద్యను అందించాలి

ఆర్‌జేడీ సుబ్బారావు

నరసరావుపేట రూరల్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఆర్‌జేడీ సుబ్బారావు తెలిపారు. లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో రెండు రోజులు పాటు పునాదిభాష, గణితంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆర్‌జేడీ సుబ్బారావు సందర్శించి మాట్లాడారు. విద్యార్థుల్లో ప్రమాణాలు పెంచేందుకు నూతన విద్యావిధానంలో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భాష, గణితంపై పునాది అభ్యసనం పెంచేందుకు శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని తెలిపారు. మూడవ తరగతిలోనే విద్యార్థులు భాష, గణితాలను చదవడం, రాయటం చేసే విధంగా నూతన విద్యావిధానంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.కె.సుభాని మాట్లాడుతూ ఇంటరాక్షన్ విధానంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎంఈవో జ్యోతికిరణ్, డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు యోగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్, రీసోర్స్‌పర్సన్స్ ఎం.శారద, రామకోటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జేడీ సుబ్బారావు

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

చిలకలూరిపేట: అన్నదాతలు అహర్నిశలు శ్రమించి సాగుచేసిన పంటలను అమ్ముకొనే క్రమంలో దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ చెప్పారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో మార్క్‌ఫెడ్ ద్వారా జీడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు కూడా రైతుల కోసం శ్రద్ధ చూపిన దాఖలాలు లేవని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. రబీ సీజన్‌లో పండించిన పప్పు ధాన్యాల కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభిస్తున్న శనగల కొనుగోలు కేంద్రంలో క్వింటా రూ. 5,335 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మిగతా పప్పు ధాన్యాలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లను చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ దేవినేని శంకరరావు, సొసైటీల అధ్యక్షులు తోట బ్రహ్మస్వాములు, సింగారెడ్డి కోటిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం.వీరారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్

ఇంటర్ ప్రథమ పరీక్షలు ప్రారంభం

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని సీఎస్‌జీఎల్ఎం జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవాసవీ జూనియర్ కళాశాల, సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పరీక్ష కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. మొత్తం ఐదు పరీక్ష కేంద్రాల్లో తొలిరోజు సెకండ్ లాంగ్వేజీ తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత పరీక్షలకు 1,559 మందికి గానూ 1,474 మంది హాజరయ్యారు. 85 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్ని రాష్ట్ర రిసోర్స్ పర్సన్, ఫ్లయింగ్ స్క్వాడ్, స్క్వేర్ బృందాలు సందర్శించాయి. కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

బెల్లంకొండలో..

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన తెలుగు పరీక్షకు మొత్తం 117 మంది విద్యార్థులకు గానూ 115 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ డి.ఆదెయ్య తెలిపారు. ఇందులో బెల్లంకొండ జూనియర్ కళాశాల నుంచి 58, కస్తూర్బా పాఠశాల నుంచి 34, రాజుపాలెం కస్తూర్బా పాఠశాల నుంచి 25 మంది ఉన్నట్లు చెప్పారు. పరీక్షలను స్థానిక తహసీల్దార్ బి.నిర్మల తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను కళాశాల అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్ని పక్కాగా నిర్వహించాలని సూచించారు. పరీక్షల్ని డిపార్ట్‌మెంటల్ అధికారి విద్యాసాగర్, స్పెషల్ ఆఫీసర్ కె.బాలు నాయక్ పర్యవేక్షించగా, ఎస్ఐ కె.అమీర్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

అమరావతిలో..

ధరణికోట రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు (ఆర్‌వీవీఎన్)కళాశాలలో ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇక్కడి పరీక్ష కేంద్రంలో కళాశాలతో పాటు అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల, పల్లోటి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు రాశారు. మొత్తం 318 మందికి గానూ 310మంది హాజరయ్యారు. పరీక్షల్ని ఆర్‌వీవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఎస్ఐ. కోటేశ్వరరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అచ్చంపేటలో..

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన ఇంటర్‌మీడియట్ పరీక్షలకు మొదటి రోజు బుధవారం తెలుగు పరీక్షకు 37మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామినేషన్స్ చీఫ్ సూపరింటెండెంట్ షేక్ రిజ్వాన్ తెలిపారు. మొత్తం 383 మందికి గానూ 344 మంది హాజరైనట్లు చెప్పారు. పరీక్ష 9 గంటలకు ప్రారంభం కాగా, విద్యార్థుల్ని 8.30 గంటల నుంచే లోపలకు అనుమతించారు.

వెన్నాదేవి రోడ్డులో 'కాశీనగర్ 1947' సినిమా షూటింగ్

సత్తెనపల్లి: శ్రీ గణేష్ దేవి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రాయదుర్గం రమాదేవిరెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తూ నిర్మిస్తున్న కాశీనగర్ 1947 సినిమా షూటింగ్ బుధవారం సత్తెనపల్లి మండలం వెన్నాదేవి రోడ్డులో జరిగింది. ఇక్కడ ఉన్న ఇటుక బట్టీల్లో ప్రతి నాయకుడి పాత్రలో నటిస్తున్న వల్లెం చెన్నకేశవ నాయుడు, జగన్నాథ పట్నాయక్‌పై కొన్ని సన్నివేశాలతో పాటు జబర్దస్త్ చిట్టిబాబు, హీరో దిలీప్ రాథోడ్, శివ, విఠల్, ఓంకార్, రాములపై కొన్ని సన్నివేశాల్ని చిత్రీకరించారు. వడ్డవల్లిలోని ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో నటి మానస, చెన్నకేశవ నాయుడులపై మరికొన్ని సన్నివేశాల్ని చిత్రీకరించారు. లక్కరాజుగార్లపాడు ఇటుక బట్టీల్లో ఫైటింగ్ సన్నివేశాల్ని చిత్రీకరించారు. ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్‌ప్లేతో పాటు దర్శకుడిగా చిత్తజల్లు ప్రసాద్ వ్యవహరిస్తున్నారు. కెమెరామెన్‌గా జి.కృష్ణ నాయుడు, దేవకి మురళీకృష్ణ, సంగీత దర్శకుడిగా లక్ష్మణ సాయి, పాటల రచయితలుగా జి. సీతారామ చౌదరి, ఎల్ఐసీ రఘుబాబు, ఫైట్స్ మాస్టర్‌గా హుస్సేన్ బాయ్, కొరియోగ్రాఫర్‌గా బండ్ల రామారావు పని చేస్తున్నారు.



షూటింగ్‌లో ఫైట్ సన్నివేశం

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

సత్తెనపల్లి: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని 16వ వార్డు శాస్త్రీనగర్‌లో బేడ బుడిగి జంగాలు నివసించే ప్రాంతంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ అరెస్ట్, బెయిల్ ,రిమాండ్ తదితర అంశాల గురించి వివరించారు. వ్యక్తిని అరెస్ట్ చేసిన 24 గంటల్లో న్యాయమూర్తి ముందు హాజరు పెట్టాలని తెలిపారు. ఈ ప్రాంతంలో నివాసం ఉండే గోవిందమ్మ అనేక ఏళ్లుగా రేషన్ కార్డు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సత్తెనపల్లి పారా లీగల్ వలంటీర్లు షేక్ సుభాని, షేక్ ఖాజాల దృష్టికి తీసుకురాగా వారు సంబంధిత అధికారులతో మాట్లాడి ఎనిమిది రోజుల్లోనే వారు మంజూరు చేయించారు. కార్డును బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సులో అందించడంతో గోవిందమ్మ ఆనందం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో పలువురు బేడ బుడిగి జంగాలు పాల్గొన్నారు.



శాస్త్రీనగర్‌లో అవగాహన కలిగిస్తున్న ప్యానల్ న్యాయవాది శ్రీనివాసరావు, లీగల్ వలంటీర్లు

కొంకెరు వాగు మార్గంలో నూతన వంతెన

ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు సహకారంతో సమస్య పరిష్కారం

శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు నుంచి గుండేపల్లి పొలాలకు వెళ్లటానికి కొంకెరు వాగుపై నూతన వంతెన (బ్రిడ్జి) పనులు పూర్తయినట్లు మండల పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి బుధవారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో ఎంపీ నిధులు రూ.23 లక్షలతో 35 మీటర్ల పొడవు కల్గిన వంతెన నిర్మాణ పనులు అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా చేసినట్లు చెప్పారు. ప్రకాశం జిల్లా వెల్లంపల్లి నుంచి తెచ్చిన 22 సిమెంటు పైపులపై కాంక్రీట్ పోసి వంతెన నిర్మాణ పనులు చేశామన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి రెండు గ్రామాల ప్రజలు రాకపోకలకు, పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే చొరవ చూపటంతో 300 ఎకరాలు రైతులు, రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇర్లపాడు నుంచి గుండేపల్లి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన వంతెన

నేడు అమరజీవి జయంతి వేడుకలు

సత్తెనపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్ని పట్టణంలోని గాంధీ చౌక్‌లో గల గాంధీ విగ్రహాల వద్ద గురువారం ఉదయం 8.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరేరామచెంచయ్య బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి హాజరవుతారని పేర్కొన్నారు. పట్టణ ప్రజలంతా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వృద్ధులకు అన్నదానం



సత్తెనపల్లి: పట్టణంలోని ఆదరణ వృద్ధుల ఆశ్రమంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ముప్పాళ్ల మండలం ఇరుకుపాలేనికి చెందిన చిన్నారి వర్షిత్ పుట్టిన రోజు సందర్భంగా తల్లిదండ్రులు బాలకృష్ణ, రమ్య అన్నదానం చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు మల్లేశ్వరి, కె.సురేష్, నాని, సోమశేఖర్, నిర్వాహకులు రిషిత పాల్గొన్నారు.

రబీలో ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

అచ్చంపేట: రబీలో సాగు చేసిన పంటల్ని రైతులంతా తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణా బేగం సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఆమె రైతులతో మాట్లాడి ఈ- క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించారు. ఈ- పంట నమోదుల జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించారు. జాబితాలో పొరపాట్లు ఉంటే సరి చేసుకోవాలని తెలిపారు. ఈకేవైసీని మార్చి 30లోగా చేయించుకోవాలని సూచించారు. మండలంలో రబీ సీజన్‌లో 881 ఎకరాల్లో ప్రధానంగా మొక్కజొన్న, శనగ, మినుము, వరి, పొగాకు, నువ్వులు, ఆముదం తదితర పంటల్ని రైతులు సాగు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

నరసరావుపేట టౌన్: జూద శిబిరంపై దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేంద్ర బాబు తెలిపారు. యలమంద తురకపాలెంలోని పాడుబడ్డ పంచాయతీ కార్యాలయంలో జూదం ఆడుతున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు.

నేటి నుంచి తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి సమ్మేళనం

నరసరావుపేట రూరల్: సాంకేతిక రంగ విద్యార్థుల్ని ప్రోత్సహించేందుకు తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నుంచి రెండురోజుల పాటు జాతీయస్థాయి సాంకేతిక, సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వై.వి. నారాయణ తెలిపారు. సమ్మేళనం ప్రచారం కార్యక్రమంలో భాగంగా గురువారం కళాశాల ఆవరణలో ఫ్లాష్‌మాబ్ నిర్వ హించారు. విద్యార్థినులకు రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వై.వి.నారాయణ మాట్లాడుతూ టీఈసీ ప్రయాగ పేరుతో ఈనెల 16,17 తేదీల్లో జాతీయస్థాయి సాంకేతిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని కళాశాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా సాంకేతిక విభాగంలో పత్ర సమర్పణ, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, కోడ్ హంట్ అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. సాంస్కృతిక విభాగంలో చిత్రలేఖనం, క్లేమౌల్డింగ్, నృత్యం, వాద్య సంగీతం, సంప్రదాయ వస్త్రధారణ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని వివరించారు. క్రీడల్లో పురుషులకు కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, పరుగు, మహిళలకు ఖోఖో, త్రోబాల్, క్యారమ్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు.